క్లుప్తంగా

ఆధార్ నవీకరణతో పారదర్శకత

కపిలేశ్వరపురం: ఆధార్ నవీకరణతో వ్యక్తిగత రికార్డుల్లో పారదర్శకత ఉంటుందని ఎంపీడీఓ కె.రత్నకుమారి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ చిన్నారుల ఆధార్ కార్డుల్లో వివరాలను నవీకరించే లక్ష్యంగా గురువారం పడమర ఖండ్రిక, వాకతిప్ప, కాలేరు సచివాలయాల్లో నవీకరణ శిబిరాలను నిర్వహించారు. ఆయా శిబిరాల్లో చిన్నారుల ఆధార్ వివరాలను డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, అల్లక ఫణీంద్ర, కోరా దొరబాబు నవీకరణ చేశారు. శుక్రవారం మాచర, పడమర ఖండ్రిక, నల్లూరు గ్రామాల్లో శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.

సింహాచలానికి పరామర్శ

కపిలేశ్వరపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న మండపేట ఏఎంసీ మాజీ చైర్మన్ నక్కా సింహాచలాన్ని ఆయన స్వగ్రామం వెదురుమూడిలో పలువురు పరామర్శించారు. మండపేట ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం జిల్లా కార్యదర్శులు శెట్టి నాగేశ్వరరావు, టి.పుల్లేశ్వరరావు, మాచిరెడ్డి సురేష్, న్యాయవాది టీవీ గోవిందరావు పరామర్శించినవారిలో ఉన్నారు.

రహదారి నిర్మాణ పనుల ప్రారంభం



కూర్మాపురం-మండపేట రహదారిలో జరుగుతున్న మరమ్మతులు

రాయవరం: మండలంలోని కూర్మాపురం-మండపేట ఆర్అండ్‌బీ రహదారి పనులను ప్రారంభించారు. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.15 లక్షల అంచనాతో ప్రత్యేక మరమ్మతుల్లో భాగంగా ఈ పనులు ప్రారంభించారు. ఆర్అండ్‌బీ డీఈఈ సూర్యనారాయణ పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నారు.

నేడు వ్యక్తిత్వ వికాస శిబిరం

రాయవరం: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని, విశ్వమానవత సంస్థ వ్యక్తిత్వ వికాస శిబిరాన్ని నిర్వహించనున్నట్టు విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి తెలిపారు. లొల్లలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, డాక్టర్ సాయిబాబాతో కలిసి వ్యక్తిత్వ వికాస శిబిరంలో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. సక్సెస్ ఫార్ములా ఫర్ స్టూడెంట్స్, మైండ్ పవర్స్ అండ్ టెక్నిక్స్, లైఫ్‌అండ్ ఎడ్యుకేషన్, మెడిటేషన్ అంశాలపై ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఆరోగ్య జీవనంపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.

రక్తపింజర హతం



మాచరలో స్థానికుల చేతిలో హతమైన సర్పం

కపిలేశ్వరపురం: మాచర జగనన్న కాలనీలో గురువారం రక్తపింజర హల్‌చల్ చేసింది. ఈ పాను చూసి కాలనీ నివాసులు భయాందోళనకు గురయ్యారు. చివరకు దానిని హతమార్చారు. సాధారణ పాములకు భిన్నంగా పెద్ద ఆకారంలో ఉందని, తల త్రికోణ ఆకారంలో ఉంటూ శరీరంపై డైమండ్ ఆకారంలో మచ్చలు కలిగి ఉండటాన్ని బట్టి రక్తపింజరగా జువాలజీ అధ్యాపకుడు మేడిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఇది విషపూరితమైన పాము అని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మండపేట: మండలంలోని ఏడిద సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యల కారణంగా పట్టణంలోని కొన్ని ప్రాంతాలు, పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కే రత్నాలరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఏడిద సీతానగరం, కొత్తూరు, సావరం, ఏడిద గ్రామాలతో పాటు, మండపేట బైపాస్‌రోడ్డు, మురమండ, గుమ్మిలేరు రోడ్డులలో సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఆయన చెప్పారు.

దివ్యాంగ పింఛన్లపై తనిఖీ పరీక్షలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం దివ్యాంగ పెన్షన్‌దారుల తనిఖీ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.15 వేలు పొందుతున్న 32 మంది ఇంటికి ప్రత్యేక వైద్య బృందం సందర్శించింది. చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్ నేతృత్వంలో ప్రత్యేక వైద్య బృంద సభ్యులు ఎన్.అశోక్, సీబీవీ సారథి తదితరులు లబ్ధిదారుల దివ్యాంగత్వాన్ని పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో 11 మంది దివ్యాంగులకు గాను 10 మందికి, చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో 22 మందికి గాను 12 మందికి పరీక్షలు నిర్వహించారు. మిగిలిన వారికి ఈ నెల 27న వికలాంగ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య బృందం తెలిపింది.

చెత్త ఉంది.. సంపదేదీ?



నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం



పామర్రులో రోడ్డు పక్కనే వేసిన చెత్త

- నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు
- పత్తా లేని అంబాసిడర్లు
- పట్టించుకోని పంచాయతీలు

కె.గంగవరం: పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా గతంలో అన్ని పంచాయతీల పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో 26 గ్రామ పంచాయతీలకు 24 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే క్రమంలో వాటిని వినియోగించడం మానేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. మండల పరిధిలోని దంగేరు గ్రామంలో తప్ప మిగిలిన పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు మొక్కుబడిగా ఉన్నాయి.

వర్మీకంపోస్టు తయారీ ఇలా..

గ్రామాల్లో పోగు చేసే చెత్తను పంచాయతీ సిబ్బంది తడి, పొడి చెత్తగా విభజించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారు. అక్కడ చెత్తలో వాన పాములను వదలి కుళ్లబెట్టడం ద్వారా దాని నుంచి కంపోస్టు ఎరువును తయారు చేస్తారు. ఆ ఎరువును రైతులకు విక్రయించి దాని ద్వారా పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోడమే కాకుండా గ్రామాల్లో పారిశుధ్య మెరుగువుతుంది. ఇదీ చెత్త నుచి సంపద తయారీ కేంద్రాల ముఖ్య ఉద్దేశం. అయితే అన్ని గ్రామాల్లో కేంద్రాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వాటిని ఎవరూ పట్టించుకోవడంలేదు.

చెత్త నిర్వహణ

చెత్తను సేకరించేందుకు గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేస్తామని చెప్పి కొన్ని గ్రామాల్లో వారిని ఏర్పాటు చేశారు. ఇళ్లలో తడి, పొడి చెత్తలను వేరువేరుగా నిల్వ చేసేందుకు గత ప్రభుత్వ హయంలో కొన్ని గ్రామాల్లో ఇంటికి రెండేసి ప్లాస్టిక్ డెస్ట్‌బిన్లు కూడా పంపిణీ చేశారు. అన్ని పంచాయతీలకు చెత్తను తరలించేందుకు రిక్షాలను కూడా పంపిణీ చేశారు. ప్రస్తుతం అవి మూలనపడి ఉన్నాయి. వాటిని గాలికొదిలేయడంతో చెత్త నుంచి సంపద తయారీ సంగతి పక్కన పెడితే గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గ్రామాల్లో పోగుపడే చెత్తను సైతం సిబ్బంది సక్రమంగా తొలగించడం లేదు. కొన్ని గ్రామాల్లో సేకరించిన చెత్తను ఊరు ప్రారంభంలో ఒక చోట పోగు చేసి కాల్చేస్తున్నారు.

రెండు గ్రామాల్లో తప్ప..

ప్రస్తుతం మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు దంగేరు, కుందూరు గ్రామాలో తప్ప మిగిలిన గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. గ్రీన్ అంబాసిడర్ల జాడే లేదు. కొన్ని పంచాయతీల వద్ద

పునరుద్ధరిస్తాం

కొన్ని గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలు బాగానే పని చేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో కేంద్రాలు నడవడంలేదు. ఈ సమస్య ఉంది. గతంలోనే ప్లాస్టిక్ బకెట్లు పంపిణీ చేయడంతో పాటు కొన్ని గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను కూడా నియమించాం. మధ్యలో ఎన్నికల కోడ్ వల్ల కొంత ఇబ్బంది కలిగింది. ఇటీవల మళ్లీ కేంద్రాలను పునరుద్ధరిస్తున్నాం. ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం.

– గౌరి కుమారి, ఈఓపీఆర్‌డీ కె.గంగవరం

చెత్త కుండీలు ఏర్పాటు చేయాలి

తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం ఇంటికి రెండేసి వంతున ప్లాస్టిక్ డెస్ట్‌బిన్లు అందించారు. అయితే వాటిని ఎవరూ వాడడంలేదు. చెత్తను చెత్తి రోడ్లపైనే వేస్తున్నారు. రోడ్లపై చెత్తను పారిశుధ్య కార్మికులు సక్రమంగా తొలగించడంలేదు. ప్రతి గ్రామంలో చెత్త కుండీలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ప్రతి వీధి చివర చెత్త కుండీలు ఏర్పాటు చేస్తే తగిన ప్రతిఫలం ఉంటుంది.

– బత్తుల విజయకుమారి, మాజీ సర్పంచ్ కుందూరు

గ్రీన్ అంబాసిడర్లు ఉన్నట్టు చూపించి ప్రతి నెల సొమ్ములు కూడా డ్రా చేస్తున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి కేంద్రాలను పునరుద్ధకరించి గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పంచాయతీల ఆదాయాన్ని పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

కుష్టు వ్యాధి లక్షణాలపై సర్వే



అంగరలో అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు, సిబ్బంది

కపిలేశ్వరపురం: కుష్టు వ్యాధి లక్షణాలున్న వారి గుర్తించేందుకు గురువారం అంగర పీసెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రత్నకుమారి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సర్వే చేపట్టారు. కార్యక్రమ నోడల్ ప్రతినిధి వెన్నేటి వెంకటేశ్వరరావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వ్యాధి లక్షణాలపై సర్వే చేశారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం గ్రామాల్లో సాగిన సర్వేలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుష్టు వ్యాధి ప్రాణాంతకమైనది కాదని, వ్యాధి సోకిన వారికి శాస్త్రీయమైన చికిత్స అందించవచ్చన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పలు, వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, అరిచేతులు, అరికాళ్లు స్పర్శ కోల్పోవడం, కాలి, చేతివేళ్లు వంకర్లు తిరగడం వంటి లక్షణాలు ద్వారా కుష్టు వ్యాధిని గుర్తించవచ్చన్నారు.

వాలీబాల్ పోటీల విజేతగా ద్వారపూడి



కలెక్టర్, డీఈవోల చేతుల మీదుగా ట్రోఫిని అందుకుంటున్న విద్యార్థులు

మండపేట: కోనసీమ క్రీడోత్సవంలో భాగంగా అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రభుత్వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ద్వారపూడి విద్యార్థులు తమ సత్తా చాటారు. గ్రామంలోని చేకూరి కాశీవిశ్వనాథరాజు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ఈ పోటీల్లో పాల్గొని ట్రోఫీని గెలుచుకున్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా వీరిని అభినందించి ప్రశంసా పత్రాలు అందించినట్టు స్కూల్ స్టాఫ్ సెక్రటరీ గండి స్వామిప్రసాద్ తెలిపారు. వారి చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నట్టు చెప్పారు. విద్యార్థులు వైమాని నరేంద్ర, డొప్పా అజయ్, బొమ్మిడి నరేంద్ర, వైమాని శ్రవణ్ కుమార్, కె.ఆదర్శకుమార్, రాయుడు చిరంజీవి దేవి ఇస్లాం, ఆర్.చిరంజీవి, బి.అఖిల్, పి.యేసు రాజులను శిక్షణ ఇచ్చిన కోచ్ ఐ కల్యాణ్, పుచ్చల గౌరీశంకర్‌లను సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉపసర్పంచ్ తులా శేషారావు, గ్రామ పెద్దలు, విద్యాకమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానోపాధ్యాయులు సవితాల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు తూలూరి నరేంద్ర, గ్రామ పెద్దలు చేకూరి రమేష్ రాజు, యరగతపు బాబ్జి, అడబాల బుల్లబ్బు తదితరులు ప్రశంసించారు.

పాడి పరిశ్రమాభివృద్ధి అందరి బాధ్యత



కపిలేశ్వరపురంలో గొర్రెకు వ్యాక్సిన్ వేస్తున్న సహాయకుడు

కపిలేశ్వరపురం: భారతీయ సంస్కృతీ మూలాల్లో ఆర్థిక పరిపుష్టి కలిగిన పాడి పరిశ్రమాభివృద్ధి అందరి బాధ్యత అని పశు సంవర్ధక శాఖ ఆలమూరు ఏడీఏ ఎల్.అనిత, అసిస్టెంట్ డైరెక్టర్ ఒ.రామకృష్ణ అన్నారు. కపిలేశ్వరపురంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ సాకా శ్రీనివాస్ ప్రారంభించారు. పాడి రైతులకు ఉచితంగా మందులను ఎంపీటీసీ శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా చేతుల మీదుగా అందజేశారు. పశువైద్యులు పాడి పశువులు, గొర్రెలకు వైద్య పరీక్షలు చేసి అవసరం మేరకు చికిత్సనందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పువ్వల చిట్టిబాబు, రైతులు నామాల బొజ్జియ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. భయం భయం

కాజులూరు: మండలంలోని కోలంక, పల్లిపాలెం రహదారిలో పలు చోట్ల రోడ్డు కాలువ కోతకు గురైన బెర్ములు కరిగిపోవడంతో ప్రయాణికులకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రెండు గ్రామాల మధ్య సుమారు మూడు కిలో మీటర్ల పొడవు ఉన్న రహదారిలో పలుచోట్ల రోడ్డు కాలువ కోతకు గురై అప్రొచ్ లేకపోవడం, పలు చోట్ల గోతులు ఏర్పడి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో భారీ వాహనాలు ఎదురు వచ్చే సమయంలో సైకిల్, మోటారుసైక్లిస్టు తప్పించబోయి కాలువలో పడిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కాలువ కోతకు గురై ప్రమాదభరితంగా ఉన్న పల్లిపాలెం రహదారి

వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత దోహదం

కాజులూరు: వ్యక్తిత్వ వికాశానికి భగవద్గీత పఠనం ఎంతగానో దోహద పడుతుందని గొల్లపాలెం అలయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు, స్థానిక ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి అన్నారు. గురువారం గొల్లపాలెంలో సమరసతసేవా ఫౌండేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ శీలామంతుల వీరభద్రరావు ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత పఠనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని పాటించే ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో వీరాచార్యులు, శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



గుమ్మిలేరు గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఫిర్యాదును స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ ప్రతినిధులు

మండపేట: విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రసల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) చైర్మన్ బీ సత్యనారాయణ అన్నారు. మారేడబాక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. జిల్లా పర్యవేక్షణ అధికారి రాజబాబు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఓ రత్నాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ, ఎస్.మసిలమణి, షేక్ బాబర్, స్వతంత్ర సభ్యులు ఎన్.మురళీకృష్ణ హాజరయ్యారు. మండపేట పరిసర గ్రామాల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు స్వీకరించారు. సాంకేతిక సమస్యలను తొలగించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఎదురైనప్పుడు ఫిర్యాదుల చేసేవారు టోల్ ఫ్రీ నంబరు 1912కి కాల్ చేసి చెప్పవచ్చన్నారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసిన విశాఖ పట్టణంలో ఉన్న తాము వాటిని స్వీకరించి పరష్కారానికి పాటు పడతామని పేర్కొన్నారు. అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారిపై విచారణ చేపట్టి తప్పు జరిగినట్టు నిర్ధారణ అయితే వారిపై చర్యలు కూడా తీసుకుంటామన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. వేదికలో 24 మంది వినియోగదారులు వినతులు అందించినట్టు డీఈఈ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ డీఈఈలు కే మురళీకృష్ణ, మల్లేశ్వరరావు, మండల విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆక్రమణల తొలగింపు



ద్రాక్షారామలో ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న ఎస్సై లక్ష్మణ్

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మార్కెట్ రోడ్డులో పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆక్రమణల తొలగింపు రెండో రోజూ కొనసాగింది. పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, వీఆర్వోలు పరంజ్యోతి, సురేష్, సర్వేయర్లు సాయిరాం, సోమశేఖర్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో ఆక్రమణల్లో ఉన్న 45 షాపులు, షెడ్లను కొన్నింటిని పూర్తిగాను, మరి కొన్నింటిని పాక్షికంగాను తొలగించారు. మరికొందరు తమ ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించారు. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ తన సిబ్బందితో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు.

పీడీఎస్ బియ్యమంటూ అడ్డగింపు



ద్రాక్షారామలో బియ్యం బస్తాల ఎగుమతిని అడ్డుకుని ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మణ్

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో శ్రీనివాస దంత వైద్యశాల ప్రాంగణంలో లారీలో బియ్యం బస్తాలు లోడ్ చేస్తుండగా అది పీడీఎస్ బియ్యమంటూ పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ సిబ్బందితో వచ్చి బియ్యం లోడుతో ఉన్న లారీని సివిల్ సప్లయ్ అధికారులు వచ్చే వరకు నిలిపివేయాలని ఉంచారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్‌కల్యాణ్ ఇటీవల కాకినాడ పోర్టులో పీడీఎస్ బియ్యం అంటూ 'సీజ్ ద షిప్' అన్న డైలాగ్ చాలా ఎక్కువగా ట్రోలింగ్ అయిన నేపథ్యంలో అదే పార్టీకి కాకినాడకు చెందిన నేత, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారని అధికారులకు చేసిన ఫోన్ చేసి చెప్పడంతో ద్రాక్షారామలో హడావుడి నెలకొంది. ద్రాక్షారామకు చెందిన సీనియర్ జనసేన నాయకుడు సయ్యద్ ఫాజిల్ సంఘటన స్థలానికి వచ్చి పోలీసులతో చర్చించారు. తీరా అక్కడ ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో గుంటూరులో జరుగుతున్న బైబిలు మిషను మహోత్సవాల్లో భోజనాల నిమిత్తం ద్రాక్షారామ, రామచంద్రపురం పరిసర చర్చిల్లో క్రైస్తవుల నుంచి సేకరించిన బియ్యం, పప్పులు, ఉప్పులు, కాయగూరల లోడుగా తేలింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎస్‌ఓ ఉదయభాస్కర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం ఆర్‌ఐ వాసంశెట్టి సత్యప్రసాద్ ద్రాక్షారామ చేరుకుని భక్తుల నుంచి సేకరించినవిగా నిర్ధారణ చేయడంతో సమస్య ముగిసింది.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

మండపేట: స్థానిక మున్సిపల్ బడ్జెట్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో జరగనున్నట్టు కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. చైర్‌పర్సన్ దుర్గారాణి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యుల సమక్షంలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నట్టు తెలిపారు. అనంతరం సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరు కానున్నారన్నారు. బడ్జెట్ సమావేశానికి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తప్పక హాజరకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సుభాష్ చంద్ర బోస్‌కు నివాళి

మండపేట: విద్యార్థులు చిన్నతనం నుంచి దేశభక్తిని పెంపొందించుకుని మన దేశంపై, ప్రజలపై గౌరవ మర్యాదలతో మెలగాలని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ముత్యాల మాణిక్యాంబ, విజయజ్యోతి పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని సంగమేశ్వర కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, మండలంలోని ద్వారపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల ఆవరణలో నేతాజీ చిత్రపటం ఏర్పాటు చేసి పుష్పాలతో జైహింద్ అంటూ జోహార్లు పలికారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ దేశం కోసం నేతాజీ పోరాటపటిమను తెలియజేశారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి తెల్లవారి గుండెల్లో నిద్రపోయిన ధీశాలి నేతాజీ అని కొనియాడారు. కార్యక్రమాలలో ఉపాధ్యాయులు చిట్టూరి వెంకటశ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.



సంగమేశ్వర కాలనీ పాఠశాలలో నేతాజీకి నివాళులు అర్పిస్తున్న చిన్నారులు

అంగర పీహెచ్‌సీలో వైద్య సేవలు



అంగర పీహెచ్‌సీలో వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యుడు

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీలోని బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం బొల్లినేని ఆసుపత్రికి చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ సన్యాసిపాత్రుడు గుండెకు సంబంధించి సమస్యలతో బాధపడుతున్న 22 మందిని పరీక్షించారు. పీహెచ్‌సీ వైద్యాధికా డాక్టర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి ఆధ్వర్యంలో 20 మందికి ఈసీజీ పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ స్థానిక పీహెచ్‌సీలో ప్రతి మంగళవారం దంత వైద్యులు, ప్రతి గురువారం కంటి వైద్యుడు, 1వ, 3వ గురువారాల్లో కార్డియాలజిస్టు, ప్రతి శుక్రవారం ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు వైద్య సేవలందిస్తారని తెలిపారు. శిబిరంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్య సేవలందించారు.

నేతాజీకి ఘన నివాళి



ద్రాక్షారామలో నేతాజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సుభాష్, నాయకులు

రామచంద్రపురం రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ద్రాక్షారామలో నేతాజీ విగ్రహానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా విశ్వ హిందూపరిషత్ కార్యదర్శి కొసనా మోతీలాల్, బీసీ నాయకుడు కడలి రాంపండుల ఆధ్వర్యంలో పలువురు నేతాజీకి నివాళులు అర్పించారు. యాట్ల నాగేశ్వరరావు, పలువురు రిక్షా కార్మికులు పాల్గొన్నారు. అన్నాయిపేట సత్యం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు నేతాజీ విగ్రహం వద్ద జాతీయ గీతాలు ఆలపించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, పెమ్మిరెడ్డి దొరబాబు, నాయకులు మాగాపు అమ్మిరాజు, డాక్టర్ మడకా రాంబాబు, పెంకే సాంబశివరావు, బట్టా నవీన్, పితాని వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఫోన్ నంబర్లు

మండపేట మండల స్థాయి అధికారుల ఫోన్ నంబర్లు

1. తహసీల్దార్	పీ.తేజే శ్వరరావు	9849903903
2. ఎంపీడీవో	కే.సత్యనారాయణమూర్తి	9391973013
3. ఈవోఈఆర్డీ	డీ.శ్రీనివాస్	9951657999
4. మున్సిపల్ కమిషనర్	టీ.వీ.రంగారావు	9849905809
5. ఎంఈవో-1 నాయుడు	రామచంద్రరావు	9440511749
6. ఎంఈవో-2	సీహెచ్.వీ. సోమిరెడ్డి	9441145835
7. మండల ఇంజనీరింగ్ అధికారి	వీ.నాగేశ్వరరావు	8977115105
8. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	డీ.చైతన్యకుమారి	9100121182
9. ఆర్అండ్‌బీ ఏఈ	టీ.వీ.ఎస్. సూర్యనారాయణ	9440818538
10. ఎలక్ట్రికల్ ఏఈ	బీ.రవికుమార్	9440812648
11. హౌసింగ్ ఏఈ	పీ.వీ.వీ. సత్యనారాయణమూర్తి	7093930491
12. ఇరిగేషన్ ఏఈ	అజీజ్	8500786756
13. వ్యవసాయ అధికారి	కే.ఏసుబాబు	8331056558
14. మత్యశాఖాధికారి	విల్ల.రమణరావు	8331953607
15. ఎంఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో	వీ.వీ.వీ. సత్యనారాయణమూర్తి	7702072569
16. రూరల్ ఎస్ఐ	శివకుమార్	9440797592
17. వెలుగు ఏపీఎం	కే.రవిరాజు	9849901695
18. సీడీపీవో	గజలక్ష్మి	6302169085
19. ఐసీడీఎస్ సూపర్‌వైజర్	ద్వారపూడి సెక్టార్	9381215076
20. ఐసీడీఎస్ సూపర్‌వైజర్	ఏడిద సెక్టార్	9030301587
21. వైద్యాధికారిణి	సీహెచ్.రమ్యశ్రీ	9652502519
22. వైద్యాధికారి	పీ.జగదీప్	9494029992
23. వైద్యాధికారి	లత	9177724823
24. వైద్యాధికారి	సూర్యనారాయణరెడి	9849131854
25. పశువైద్యాధికారి	రాజ్‌కుమార్	7989535625
26. డ్రైయినేజ్ ఏఈఈ	జీ.సాయిచంద్రిక	8886066939
27. ఎక్సైజ్ సీఐ	వీ.నాగేశ్వరరావు	9959818277
28. ఏపీఎస్ఆర్టీసీ డీఎం	రామచంద్రపురం కే.వెంకటేశ్వర్లు	9959225536
29. ఉద్యానవన శాఖాధికారి	ఎం.అనూష	8712625211